# గడువులోగా అర్జీల పరిష్కారం

• కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. అధికారులు బాధ్యతతో పని చేసి ప్రజల నుంచి వచ్చే వినతులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.కేశవ నాయుడు, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలతలతో కలిసి ప్రజల నుంచి 132 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్ర రావు, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

**ఎస్పీకి 7 ఫిర్యాదులు**

పార్వతీపురంటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఎస్పీ స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో వంచన, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ బి.ఎండి.ప్రసాద్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణ

**వినతులు అంతంత మాత్రమే**

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతులు అంతంతమాత్రంగానే వచ్చాయి. పీఎం జన్‌మన్‌లో హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రజాసమాఖ్య నాయకులు సవర చిరంజీవి, ఎస్.మోహన్‌పాల్‌లు కోరారు. సవర పౌల్ట్రీ షెడ్ నిర్మించుకోవడానికి రుణం మంజూరు చేయాలని గంగారావు అర్జీ సమర్పించారు. మెట్టుగూడకు చెందిన మంగయ్య పవర్ టిల్లర్ ఇప్పించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇప్పించాలని మరికొందరు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## 'సూపర్ సిక్స్' అమలెప్పుడు?

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడిచినా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాల్లోని ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. పథకాల కోసం ఓట్లు వేసిన జనమంతా పథకాలు ఎప్పుడు ఇస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ పథకం ఎప్పుడు ఇస్తారో ముందుగానే క్యాలెండర్ విడుదల చేసి, ఆ తేదీల ప్రకారం ఇచ్చేవారన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ఇంతవరకు రైతుకు ఇస్తానన్న రూ.20 వేలు ఇంకా ఇవ్వలేదన్నారు. పాఠశాలలు ప్రారంభమైనా ఇప్పటివరకు తల్లికి వందనం పథకం కింద ప్రతీ పిల్లవాడికి ఇస్తానన్న రూ.15 వేలు అందివ్వలేదన్నారు. ఎప్పుడు అమలు చేస్తారో కూడా స్పష్టత ఇవ్వడం లేదని మండిపడ్డారు.

ఇప్పటికైనా ఏ పథకం ఎప్పుడు ఇస్తారో చెప్పకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు.

## శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించండి

తెర్లాం: శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై, ఎంపీడీవో శంబంగి రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యంగా వర్షాకాలంలో బురదలో పాడె మోసుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కొన్నిసార్లు బురదలో జారిపడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. కొన్నేళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గోర్జిలో నుంచి శ్మశానవాటికకు వెళ్లేవారమని, కొంతకాలంగా ఆ గోర్జి బాగులేకపోవడంతో అలా వెళ్లడం మానేశామన్నారు. గతంలో తాము శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు ఇప్పుడు బాగుందని, అదే దారిలో వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని వారంతా కోరారు. స్పందించిన ఎంపీడీవో.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ కాలనీ యువకులు

## నిధుల వినియోగంపై ఆడిట్

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ ఆడిటర్ ఎంవీబీఎస్ రాజు, సీనియర్ అసిస్టెంట్ ఉమాదేవిల బృందం సోమవారం ఆడిట్ చేయగా, వారికి అవసరమైన రికార్డులను కార్యాలయ సిబ్బంది అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను మంజూరైన నిధులు, వినియోగం, పీడీఎఫ్, జనరల్ ఫండ్స్, 15వ ఆర్థికసంఘం నిధులు–ఖర్చులపై ఆరాతీశారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ బృందం

## దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ

జియ్యమ్మవలస: దశపర్ణి కషాయంతో పంటలను ఆశించే చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం అసోసియేట్ జి.అన్నపూర్ణ తెలిపారు. మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో దశపర్ణి కషాయం తయారీ, వినియోగం, ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. వేప, సీతాఫలం, కాగు, మామిడి, జిల్లేడు, నేరేడు తదితర 10 రకాల ఆకులను చూర్ణం చేయాలని, అలాగే 50 గ్రాముల పచ్చిమిర్చి, మరో 50 గ్రాముల వెల్లుల్లిని గుండగా చేసి ఉంచుకోవాలన్నారు. వాటిని పావులీటరు ఆవుమూత్రం, 8 లీటర్ల నీరు కలిపిన దానిలో కలిపి పులియబెట్టాలన్నారు.

ఇలా 30 నుంచి 45 రోజుల పాటు పులియబెట్టిన దానికి పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలతో పాటు కాయతొలుచు పురుగు, రసం పీల్చే పురుగు, పచ్చదోమ, తెల్లదోమ వంటి తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లత, జగదీశ్వరి, నాగమణి, పార్వతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బలోపేతంపై చర్చించాలి: డీఈఓ

వీరఘట్టం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాఠశాలల బలోపేతానికి గ్రూప్ చర్చలు జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలపై విశ్లేషణ, అసెస్మెంట్, క్వశ్చన్ ఫార్మేట్స్, టీచ్ టూల్, ఎఫ్.ఎల్.ఎన్, సోషల్ ఆడిట్, లైబ్రరీ బుక్స్, శాలసిద్ధి, తదితర విషయాలపై చర్చించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. అలాగే బిటివాడ, కత్తులకవిటి, నీలానగరం జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పత్రి కృష్ణమూర్తి పాల్గొని ఈ సమావేశాల ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, వీరఘట్టం కాంప్లెక్స్ ఛైర్మన్ బి.సాంబర, సెక్రటరీ కె.విజయకుమార్, డీఆర్పీ మజ్జి పైడిరాజు, సీఆర్పీ కె.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

## టేకు ప్లాంటేషన్ పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: అటవీశాఖ పరిధిలోని పి.ఆమిటి, ఎస్‌కే పాడు గ్రామాల పరిసరాల్లో చేపట్టిన టేకు ప్లాంటేషన్‌ను డీఎఫ్‌వో ప్రసూన సోమవారం పరిశీలించారు. అనంతరం అక్కడి మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. అడవుల సంరక్షణకు నిత్యం కృషి చేయాలని, చెట్ల నరికివేత, అక్రమ కలప రవాణాను నివారించాలని సూచించారు. ఆమె వెంట కురుపాం రేంజర్ మణికంఠేశ్వర రావు, బీట్ ఆఫీసర్లు ఎస్.రామారావు, నీలామణి తదితరులు ఉన్నారు.



టేకు మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో ప్రసూన

## ఈ-పంట నమోదు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఈ-పంటల నమోదు సోమవారం ప్రారంభమైంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 12,170 ఎకరాల్లో వరి పంట, 65 ఎకరాల్లో పత్తి, 472 ఎకరాల్లో చెరుకు, 292 ఎకరాల్లో మొక్కజొన్న, 709 ఎకరాల్లో అరటి, 108 ఎకరాల్లో కూరగాయ పంటలు సాగులో ఉన్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య తెలిపారు. ఈ-పంటల నమోదుకు క్షేత్ర స్థాయి పర్యటనకు వచ్చే వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ ఖరీఫ్‌లో రైతులు ఏ పంట వేస్తే ఆ వివరాలు మాత్రమే వ్యవసాయ సిబ్బంది ఈ-పంటలో నమోదు చేయాలని సూచించారు.



తెట్టంగిలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

**నేడు వాహనాల వేలం**

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలంపాట మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్ఐ బి.శివప్రసాద్ ఓ ప్రకటనలో సోమవారంవెల్లడించారు. కురుపాం, ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో సారాతో పట్టు బడిన 8 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నామన్నారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో ఉదయం 10 గంటలకు జరిగే వేలంపాటను ఆసక్తి ఉన్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్స్

పాలకొండ: అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమేరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ ద్వారా ఎన్నో మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయుడు, బుజ్జి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉండాలి**

పాలకొండ: రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ సూచించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో నదీ తీర గ్రామాల్లో నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సర్వీసు సక్రమంగా అందించాలన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సంతకవిటి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య మహాజన సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. అధ్యక్షురాలిగా కె.సూర్యకాంతం, ఉపాధ్యక్షురాలిగా జి.అనితకుమారి, కోశాధికారిగా జి.సుజాత, కార్యదర్శిగా ఎ.సరస్వతి, సంయుక్త కార్యదర్శిగా ఎ.మంగమ్మ ఎంపికైనట్లు ఏపీఎం సీతారాం తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## మెరుగైన విద్యాబోధన అందించాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యా జోస్పిన్ సోమవారం సందర్శించారు. స్టోర్ రూమ్‌లోని సరుకుల నిల్వలు, విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు.



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న న్యాయమూర్తి సౌమ్యా జోస్పిన్

# ఆప్యాయంగా రాఖీపండగ

రాఖీపండగను పురస్కరించుకుని జిల్లాలోని అక్కా చెల్లెమ్మలకు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మండలంలోని బూర్జ ఆయుర్వేద ఆస్పత్రిలో డాక్టర్‌గా విధుల్లో ఉన్న టి.హేమాక్షి తన అన్నయ్య డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావుకు సోమవారం రాఖీకట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ జగన్మోహనరావు సోదరి డాక్టర్ హేమాక్షిని ఆశీర్వదించారు. అలాగే జిల్లా అధికారులకు పార్వతీపురం జిల్లా కేంద్రంలో బ్రహ్మ కుమారి జ్ఞానరత్నం రాఖీలు కట్టారు. – సీతానగరం / పార్వతీపురం టౌన్, మక్కువ



డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్మోహనరావుకు రాఖీకడుతున్న డాక్టర్ టి.హేమాక్షి



మక్కువ: సోదరుడికి రాఖీ కడుతున్న చెల్లెలు



మాజీ ఎమ్మెల్యే జోగారావుకు రాఖీ కడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



డీఆర్ఓ శివకేశవ నాయుడుకు



మున్సిపల్ కమిషనర్‌కు



తహసీల్దార్ సోమేశ్వరరావుకు



జేసీ ఎస్ఎస్ శోభికకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి జ్ఞానరత్నం

## క్లుప్తంగా

**సిద్ధమవుతున్న బొజ్జగణపయ్య**



పూజలకు సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు

సీతానగరం: వినాయక నవరాత్రి ఉత్సవాలు మండలంలో వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు వివిధ ఆకారాల్లో గణపయ్య ప్రతిమలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక కుమ్మరి వీధిలో కుమ్మరికులస్థులు రెండు నెలలుగా మట్టిని పులబోసి శుద్ధిచేసి వివిధ ఆకారాల్లో బొజ్జగణపయ్య విగ్రహాలను తయారుచేశారు. భక్తులందరూ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని అర్చకులు ప్రసాదశర్మ, నాగరాజు శర్మలు కోరుతున్నారు.

**గోతుల పూడ్చివేత**



కవిరిపల్లి గ్రామంలో రహదారిపై ఏర్పడిన గోతులను కప్పివేయిస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామంలో రహదారిపై ఏర్పడిన గోతులను సర్పంచ్ అలమండ సుధ తన సొంత నిధులతో సోమవారం కప్పివేయించారు. మక్కువ నుంచి శంబర గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో కవిరిపల్లి గ్రామంలో మలుపు వద్ద రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో కొన్నిరోజులుగా వాహనచోదకులు, ఆర్టీసీబస్సుల డ్రైవర్లు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు సర్పంచ్ సుధ స్పందించి గోతులను పూడ్చివేయించారు. తన సొంతనిధులతో సర్పంచ్ గోతులను కప్పివేయించడంతో వాహనచోదకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

**కొండబుచ్చమ్మపేటలో ఫాగింగ్**



గ్రామంలోఫాగింగ్ చేస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని సరాయివలస పంచాయతీ కొండబుచ్చమ్మపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సరళ పర్యవేక్షణలో సర్పంచ్ తెర్లి మోహిని సోమవారం గ్రామంలో ఫాగింగ్ జరిపించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామంలో మురుగునీరు చేరి, దోమలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణకు గ్రామంలో ఇంటింటా ఫాగింగ్ జరిపించారు. గ్రామస్తులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సెక్రటరీ సరళ తెలిపారు కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**పెండ్లి కూతుళ్లకు కానుక**



పెండ్లి కుమార్తెకు కానుక అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం, శ్రీనివాసరావు

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామానికి చెందిన పెండ్లి కూతుళ్లకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు సోమవారం కానుకలు అందించారు. గ్రామానికి చెందిన పెండ్లి కుమార్తెలు మాగంటి పావని, యడ్ల గంగోత్రిలకు సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతులు మీదుగా ఒక్కొక్కరికి రూ.10వేలు, చీరలు అందజేశారు. గ్రామంలో పేదింటి పెండ్లికుమార్తెకు పెళ్లి జరిగితే, గత నాలుగేళ్ల నుంచి ఎంఎస్ఆర్ ఫౌండేషన్ తరపున కానుకలు అందజేస్తున్నారు.

**పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు**



వ్యాన్‌లో కాళ్లు కట్టి ఉన్న పశువులు

సీతానగరం: ఒడిశా నుంచి విశాఖకు వ్యాన్‌లో 20 పశువులను సోమవారం తరలిస్తుండగా వ్యాన్‌తో పాటు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు తరలించడానికి వ్యాన్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారన్నారు. మండలంలోని జోగింపేట సమీపంలో పశువులతో వెళ్తున్న వ్యాన్‌ను అదుపులోకి తీసుకుని అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుముందు హాజరు పరచనున్నామని తెలిపారు.